

# లోకం చెడిపోలేదు

వి.కె. విశ్వనాథశర్మ

'చిట్టి లేచిపోయింది. కులంగాని వాడితో, అందునా కిరసనాయిలు అమ్ముకునే వాడితో పోయింది.'

—వీధివీధంతా అనుకుంటున్నారు. వృగవాది వుదంతంలా చెప్పుకుంటున్నారు. మా యింటి వంక వింతగా చూస్తున్నారు.

"మాయదారి పిల్ల! ఇదేం పోయే కాలం!" అమ్మ వాపోయింది. "అయ్యప్ప గుళ్ళోకి అన్నప్ప గుళ్ళోకీ వెళ్ళగానే సరా! పిల్లముండని అదుపులో పెట్టుకోలేకపోయాక!" తిట్టిపోసింది.

"ఆఁ! మనకెందుకులే! వాళ్ళ ఏడుపేదో వాళ్ళని ఏడవనీ!" అన్నయ్య అన్నాడు.

"వెర్రిగానీ ఆ పిల్ల లేచిపోవటమేవిఁటి? ఓణీలు మొదలెట్టి వారం తిరగలే. ఎవరో మంత్రం వేసుంటారు" మంత్రతంత్రాల్లో మంచి గురున్న వదిన అభిప్రాయపడింది.

ఇంట్లో పైకి మాట్లాడనిది నేనొక్కణ్ణే. లోపల మాత్రం ఏదో తెలీని వేదనగా వుంది. చిట్టివాళ్ళింట్లో అద్దెకుంటున్నాం- అయినా మా యింట్లోనే ఏదో జరగరానిది జరిగినట్టు బాధపడుతున్నాను. అంతేకాదు. ఓ ఆడపిల్ల జీవిత సమస్య యిది.

—ఇవేళ చిట్టి లేచిపోయిందనే అనుకుంటే! అనుకుంటే ఏవిఁటి? అరుస్తున్నది లోకమంతా. చిట్టికి అసలేమైందో ఎవ్వరికీ తెలీదు. 'చీకటి పడ్డ తర్వాత చిట్టి కనబళ్ళేదు ఇంట్లో'. ఇంట్లోవాళ్ళకి అంతే తెలుసు. పక్కనున్న పాపారావుగారు-"మసక చీకట్లో చూసాను-చిట్టి కిరసనాయిలు వాడితో గుసగుసలాట్టం. నన్ను చూసి వాడు తప్పించుకున్నాడు. చిట్టి ఇంటి వైపు

రావటం గమనించాను. మరి!..."

అరడజను మంది ఆడపిల్లల్ని ఆర్మీ డిసిప్లిన్‌లో పెంచుతున్న తండ్రని పాపారావుగారి గురించి అందరికీ తెలుసు. అందుకే నమ్మక తప్పలేదు.

"అయినా మాధవరావుగారూ! అమ్మాయి గురించి చాలామార్లు హెచ్చరించానుగా బాబూ!" అంటూ పాపారావుగారు చెప్పిన కోవంటి రహస్యం అందరూ విన్నారు నోళ్ళమీద వేళ్లూ కళ్ళలోంచి చూపుల ముళ్ళూ—ఎటు చూసినా.

ఆడదాని సమస్యలకీ అణుశక్తి సంభాషణలకీ ఓ అంతూ పంతూ లేవేమో!

చిట్టిరూపం నా ముందు కదుల్తోంది. చిట్టి నిజంగా చిట్టే. పొట్టిగా, అందంగా ఒక్క ముక్కలో ఎర్రరంగు మారుతీ కార్లా వుంటుంది చిట్టి. మరీ అంత మాటకారి కాదు. ఎక్కువసేపు సినిమా పాటలు వినటం 'ఆ పిల్ల పిచ్చి' అని అమ్మ చెప్పగా వినటమే! చదువు అంతలేదట. అది ఆసరాగా తీసుకుని చిట్టి పెద్దొదినగారు చీటికీ మాటికీ విసుక్కోవటం, పెద్దన్నగారు చెయ్యి చేసుకోటం నాకు తెలుసు

"ఎప్పుడూ వేధించుక తింటారు పిల్లని. పాపం!" అమ్మ అన్నదోసారి.

"తల్లి లేని పిల్ల! అంతే మరి" వదిన చాలాసార్లంది.

"తల్లి లేకపోతేనేం కుదురైన పిల్ల" ఇరుగుపొరుగుల సభల్లో వినిపించిన మాట యిది.

— ఇప్పుడెవరూ అనటంలేదు అలాని. కనీసం సానుభూతి వాక్యం వినబడటంలే.

చిట్టీవాళ్ళ చిన్నన్నయ్య నాకు కొంచెం క్లోజు "పోలీసురిపోర్టిచ్చారా?" అని అడిగేను. ఇచ్చారట.

చిట్టీవాళ్ళ పెద్దొదిన అంజనం వేయించిందట. అంజనంలో చిట్టి కిరసనాయిలు వాడితో ఏదో హోటలు రూంలో కనబడిందట. ఇంకోచోట పార్కులో తిరుగుతూ కనిపించారట!

—చిట్టి కిరసనాయిలువాడితో లేచిపోయిందన్న విషయాన్ని మరింత ధృవపరిచింది ఆవిడ.

ఒకవేళ నిజమే అయితే!

మాధవరావుగారికి తలవంపులుకాదూ!

చిట్టీ వాళ్ళన్నయ్యలు భరించలేరు.

నాకేమనిపిస్తోందంటే - చిట్టిని దగ్గరకు తీసిన వాడెవడైనా సరే, అవసరం కాగానే కిళ్ళీ వుమ్మినట్టు చెయ్యకూడదు. సమాజానికి భయపడకూడదు. ఎదురు తిరగాలి. ముందుకి వురకాలి.

ప్రేమసాగరం ముందు ఏ సముద్రమూ పెద్దది కాదని చెప్పగలగాలి. ఆదర్శానికి రూపకల్పన జరగాలి.

రెండురోజుల కాలం - నిస్పృహా నిరాశలతో, నిర్వేద నిట్టూర్పులతో, కసీకోపాలతో కరిగిపోయింది.

మూడోరోజు సాయంత్రం - బాగా చీకటిపడిన తర్వాత చిట్టిని వెంటబెట్టుకొచ్చారు మాధవరావుగారు. వస్తూనే చిట్టి రెక్కపట్టుకుని ఇంట్లోకి తోశారు విసురుగా.

బావురుమంది చిట్టి. నా గుండె బరు వెక్కింది. అమ్మా, అన్నయ్యా, వదినా లోపలికి వెళ్ళేరు. ఆత్రంగా ఆవేదనగా నేను గుమ్మంలోంచి చూస్తున్నాను.

మాధవరావుగారు రూళ్ళకర్ర తీసు కుని బాదుతున్నారు చిట్టిని. చిట్టి వదిన గారు తిట్ల కట్టెల్తో నిప్పు రాజేస్తోంది మరింతగా. అమ్మా, అన్నయ్యా, వదినా అడ్డు వెళ్ళేరు.

"అదేవిఁటమ్మాయ్! అలా చెయ్యొచ్చునా?" అమ్మ మందలిస్తూ అడిగింది.

చిట్టి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"మాధవరావుగారూ! అయిందేదో అయింది. అసలు కథ నెమ్మదిగా గుట్టుగా తెలుసుకోండి" అంటూ బైటికొచ్చేడు అన్నయ్య. తలుపు తనే వేసాడు బైట్నుంచి.

గంట తర్వాత అమ్మ వచ్చింది బైటికి.

ఆత్రంగా ఆదుర్దాగా చూసాను అమ్మ వంక. అన్నయ్యా వదినా అడుగుతున్నారు ఏవైందని.

"కిరసనాయిలు వెధవతోనే వెళ్ళింది. ఆ ముండాకొడుకు పెళ్ళి చేసుకుంటానన్నాట్ట. ఏదీ! రెండ్రోజులు తిండీ తిప్పలూ లేకుండా చేసి ఓ సినిమా చూపించి పొమ్మని పోలీస్ స్టేషన్‌లో వదిలాట్ట. ఏవో పూలు కొనిపెట్టేట్ట ఓ సారి. ఎక్కడో పార్కులో పడుకున్నాట్ట. ఏ పాపమూ చేసెరగదట!" అమ్మ చెప్పింది

"చాలా కథే నడిపిందన్నమాట" వదిన అన్నయ్యవంక చూపింది.

అన్నయ్య ఏవీఁ అనలేదు.

ఆ రాత్రి చాలా పొద్దుపోయేదాకా చిట్టిని కొడుతూ, తిడుతూ వున్నారు.

నాకు నిద్ర పట్టలేదు-తెల్లారురయీూము వరకూ. చిట్టి రేపటి జీవితం గురించే నా ఆలోచన.

"త్వరగా ఏదో సంబంధం చూసి మూడుముళ్ళూ వేయించండి- గుట్టు చప్పుడూ లేకుండా" తెల్లారి లేస్తూనే విన్నాను అమ్మ మాధవరావు గారికి చెబుతుంటే.

* * *

చిట్టికి పెళ్ళి కుదరలేదు.

సంవత్సరం అయింది,

వచ్చిన సంబంధాలు లోకం వూదే బాకాలకు లొంగిపోతున్నాయి.

చిట్టి ఏడుస్తూనే వుంది. ఎవరితోనూ మాట్లాడకుండా తండ్రిచేతా, అన్నగార్లు వదినల చేతా ఎన్ని మాటలు భరిస్తోందీ!

"మమ్మల్ని చంపిగానీ నువ్వు ఈ యింట్లోంచి విరగడవ్వవు" చిట్టి వదిన గారి మాటలు విషంలో ముంచిన కత్తులే.

చిట్టి వాళ్ళన్నయ్యలు చాలాసార్లు చిట్టిమీద చెయ్యి చేసుకోటం బాగా తెలుసు నాకు.

ఇంత జరుగుతున్నా, "తప్పుడు పనికి ఫలితం", అంటూ కొట్టేసింది అమ్మ.



వదినా అన్నయ్యలు అసలు పట్టించుకోలేదు.

చిట్టి ఆడదై పుట్టటమే తప్పా? ఎంత ఘోరమైన శిక్ష? అదే మొగాడైతే ఇంతగా దండిస్తారా?

ఎంత నిర్దయ ఈ లోకానికి!

'అయితే నువ్వూ ఈ లోకంలో ఒకడివి'. అన్నది నా అంతర్వాణి.

ఔను. నిజమే. చిట్టికి నేనెందుకు చెయ్యందివ్వలేను! చిట్టిని నేనే పెళ్ళి చేసుకుంటా.

కానీ అమ్మ ఒప్పుకోదు. అన్నయ్య అగ్గవుతాడు. తన చెల్లెల్ని కట్టబెడదామనుకుంటున్న వదిన కత్తి దూస్తుంది.

—అయినా సరే! అందర్నీ ఎదిరిస్తాను. చిట్టి కన్నీరు తుడుస్తాను.

ఓ రోజు - సాయంత్రం భోజనాల వేళ నా నిర్ణయం చెప్పేను ఇంట్లో-

అనుకున్నంతా అయింది.

"పోయేకాలం వచ్చిందా" అంది అమ్మ.

"ముండమోపి వేషాలు వెయ్యక" అన్నాడు అన్నయ్య.

"నీ కేవన్నా మతి చెడిందటయ్యా" అంది వదిన.

"నా పెళ్ళి, నా యిష్టం" దృఢంగా అన్నాను.

ముగ్గురూ ముఖాలు చూసుకున్నారు.

"మీరు మాట్లాడితే సరే: లేకపోతే నేనే మాట్లాడతా మాధవరావుగారితో" మజ్జిగన్నం తినకుండానే లేచి వెళ్ళిపోయాను.

రాత్రల్లా అమ్మా వదినా నాకు నచ్చచెప్ప చూసారు. అమ్మ కళ్ళనీళ్లు పెట్టుకుంది. వదిన ముక్కు ఎగపీల్చింది తన చెల్లెల్ని గుర్తుచేస్తూ.

అసలీ దుర్బుద్ధి ఎలా పుట్టిందన్నారు అన్నయ్య.

నేను మారలేదు.

తెల్లారింది.

అమ్మా, అన్నయ్య వెళ్ళేరు మాధవరావుగారితో మాట్లాడేందుకు.

నెల తర్వాత పెళ్లి ముహూర్తం.

చాలామంది నోళ్లు నొక్కుకున్నారు.

చాలామంది పళ్ళికిలించారు.

ఎంతోమంది అమ్మనీ అన్నయ్యనీ ఎత్తి పొడిచారట. వదిన పక్కింటికి మంచినీళ్ళు తెచ్చేందుకు వెళ్ళలేకపోయింది.

ఫయిరింగ్ స్క్వాడ్‌లా అందర్నీ కాల్చేయాలనిపించింది నాకు.

పెళ్ళి పదిరోజుల్లో పడింది.

మరో ప్రకంపనం పుట్టించింది లోకం — "అబ్బాయిలో ఏదో లోపం వుంది. అందుకే ఆరాటపడుతున్నాడు- అన్నీ అయిన పిల్లని చేసుకోటానికి." పాపారావుగారి భార్య అన్నదట. వదిన మోసుకొచ్చిందీ మాట. నేను పట్టించుకోలేదు.

పెళ్ళి వారం వుందనగా చిట్టీవాళ్ళన్నయ్య పిలిచేడు నన్ను.

"డాక్టరు దగ్గరికి వెళ్దాం" అన్నాడు.

నాకు కోపం రాలేదు. అతని మీద జాలి వేసింది.

"పదండి" అన్నాను.

"ఆగండి:" ఎప్పుడు ఎక్కడ విందో— చిట్టి తడికల గది తలుపు తీసుకు బైటికి వచ్చింది. అమ్మా, అన్నయ్య, వదినా, మాధవరావుగారూ ఆయన కోడలూ - చిట్టి మాట వినటం వల్లనేమో - వరండాలోకి వచ్చారు.

అప్పుడు అంది చిట్టి - "నేను మెచ్చుకునే విధంగా - నాకు నచ్చిన విధంగా - "లోపం ఉన్నది మీలో. ఆయన్లో కాదు. ఆయన డాక్టరు. మానవత్వం డిగ్రీ వున్న డాక్టరు. మీరే రండి ట్రీట్‌మెంటుకి".

చిట్టి ఎంత చక్కగా అర్థం చేసుకుందీ నన్ను. అప్రయత్నంగా చిట్టికి చెయ్యందించాను.

గండశిలల్లా చూస్తున్న అందరి ముందునించీ దూరంగా నడిచేం — నేనూ నా చిట్టీ. ◘